తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
1 నవంబర్ 2026
పేజీలు : 08
Follow :

# ప్రభుత్వాసుపత్రిలో దారుణం

## గర్భిణీ స్త్రీకి డెలివరీ చేసిన అటెండర్లు, ఆయాలు

నాలుగు రోజుల క్రితం షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి (పక్కన.. ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణు వర్ధన్)

- మృతి చెందిన తల్లి, నవజాత శిశువు
- వైద్యుల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించిన నాలుగు రోజులకే ఘటన
- నలుగురు గైనకాలజిస్టుల్లో ఒక్కరూ విధుల్లో లేకపోవడమే మృతికి కారణం

ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చిన తల్లి.. బిడ్డకు జన్మనివ్వాల్సిన చోటే విగతజీవిగా మారింది. తల్లి క్షేమంగా తిరిగొస్తుందని ఎదురుచూసిన ఇద్దరు చిన్నారులకు తీరని శోకం మిగిలింది. ఒకరు రెండో తరగతి, మరొకరు మొదటి తరగతి చదువుతున్న ఆ పసిపిల్లలకు అమ్మ ఇక తిరిగిరాదన్న నిజం గుండెలు పగిలేలా చేసింది. షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యమని ఆరోపణలు వెల్లువెత్తుతున్న వేళ.. తల్లితో పాటు నవజాత శిశువు కూడా మృత్యువాత పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. నలుగురు గైనకాలజిస్టులు ఉన్న ఆసుపత్రిలో ఒక్కరూ విధుల్లో లేకపోవడమే ఈ దారుణానికి కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసుపత్రిని సందర్శించిన నాలుగు రోజులకే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ప్రభుత్వ వైద్య సేవల తీరుపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)

మిగితా మెయిన్‌లో

# విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు

## మల్కీజ్‌గూడలో పంటలను పరిశీలించిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- సాగునీరు, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్
- పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా
- 33 కేవీ సబ్‌స్టేషన్ తనిఖీ.. విద్యుత్ అధికారులకు ఆదేశాలు

**యాచారం, అక్టోబర్ 31 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. సాగునీటి కొరత, విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాచారం మండలం మల్కీజ్‌గూడ గ్రామంలో శనివారం ఎండిపోయిన పంటలను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను లోపలి పేజీలో

# గ్రామాల్లో గల్లీకో బెల్టు షాపు.ఏరులై పారుతున్న మద్యం

- అక్రమ మద్యం విక్రయాలకు అడ్డూ అదుపులేదా
- ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా అమ్మకాలు
- బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ దాడులు ఎప్పుడు.?

**ధారూర్,అక్టోబర్ 31(జనంసాక్షి) :** ధారూర్ మండల గ్రామాల్లో మద్యం విక్రయాలు గల్లీకో బెల్టు షాపు అన్న చందంగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు వెలుస్తుండటంతో మద్యం వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే లోపలి పేజీలో

# గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి : తలసాని
- బన్సీలాల్‌పేట, మోండా, పద్మారావునగర్‌లో నమోదు కార్యక్రమాలు
- దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపణ
- కాలనీలు, బస్తీల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపు

లోపలి పేజీలో

# సుప్రీంకోర్టు తీర్పు పట్ల శేరిలింగంపల్లిలో సర్వత్రా హర్షం

- ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కళ్ళు తెరవాలి
- సుప్రీం ఉత్తర్వులను కఠినంగా అమలు చేస్తూ ప్రభుత్వ భూమిని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- మీనమేషాలు లెక్కిస్తే ఉన్న భూమి పోయి భవిష్యత్తుకు మింగ మెతుకు మిగలదు : వామపక్షాలు

లోపలి పేజీలో

# శ్రీధర్ రెడ్డిని సన్మానించిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**కేశంపేట, అక్టోబర్ 31 (జనం సాక్షి ) :** మండల పరిధిలోని కొత్త పేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డిని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించిన శ్రీధర్ రెడ్డికి చైర్మన్ పదవి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఆయన భవిష్యత్ రాజకీయాల్లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పిప్పళ్ళ శ్రీనాథ్, యూత్ కాంగ్రెస్ నాయకులు అమేర్, కద్దాల శ్రీధర్, పుట్నాల రాజు, ఆవ రాఘవేందర్, అఖిల్, అజహర్, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

# సీఐ, ఎస్ఐలకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానం

**కేశంపేట, అక్టోబర్ 31 ( జనం సాక్షి ) :** మండల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరమేష్‌లను శనివారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనాథ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎండి.అమేర్, కద్దాల శ్రీధర్ ,మండల వైస్ ప్రెసిడెంట్ రాఘవేందర్ , నాయకులు అఖిల్, అజహర్, ఇసాక్, రాజు, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

**కేశంపేట, అక్టోబర్ 31 ( జనం సాక్షి ) :** పోలీసు అధికారులు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని దత్తాయపల్లి సర్పంచ్ మామిడిపల్లి భాస్కర్ ఆకాంక్షించారు. ఇటీవల మండల నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన బి శ్రీనివాస్, ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పరమేష్ లను సర్పంచ్ భాస్కర్ తో పాటు గ్రామ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్సై లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మందడి యాదయ్య గౌడ్, నాయకులు ప్రవీణ్, గట్లవెల్లి రామకృష్ణ, మామిడిపల్లి నర్సింలు పాల్గొన్నారు.

## అయోడిన్ వినియోగంపై మహిళలకు అవగాహన

**ఖైరతాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** మహిళలు, యువతుల్లో అయోడిన్ వినియోగంపై అవగాహన పెంచేందుకు ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రామ్(ఏఎస్ఐపీ) రెండేళ్లపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 32 జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఐటీసీ ఫుడ్స్ బిజినెస్ యూనిట్ సీఈఓ అనుజ్ రుస్తగి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 13 లక్షలకు పైగా మందికి చేరువయ్యారని తెలిపారు. తుది అధ్యయనంలో మొత్తం అవగాహన స్కోరు 37 శాతం పాయింట్లు, అయోడిన్‌పై ప్రాథమిక అవగాహన 26 శాతం పాయింట్లు పెరిగినట్లు వెల్లడైనట్లు చెప్పారు. అయోడిన్ సభలు, వీధి నాటకాలు, పాఠశాల కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో భారీ అగ్నిప్రమాదం

## రూ.1.5 లక్షల ఆస్తి, కీలక పత్రాలు దగ్ధం

**ముషీరాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి):**విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుని భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఈ ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో శనివారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కృష్ణానగర్ కాలనీలోని రాజా డీలక్స్ థియేటర్ వెనుక భాగంలో షేక్ షబీర్ (34) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. శనివారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.అదే సమయంలో కుటుంబ సభ్యులు పక్క గదిలో ఉండగా, ఇంట్లో నుంచి పొగ వెలువడటం, పొగ వాసన రావడంతో వారు అప్రమత్తమయ్యారు. వెంటనే ఇంటి నుంచి బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం అగ్నిప్రమాదం విషయాన్ని స్థానికులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంట్లోని విలువైన వస్తువులు, గృహోపకరణాలతో పాటు సుమారు రూ.1.5 లక్షల విలువైన ఆస్తి అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు షేక్ షబీర్ తెలిపాడు. అంతేకాకుండా కుటుంబానికి సంబంధించిన కీలకమైన పత్రాలు సైతం పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

# పంచాయతీ కార్యాలయం పక్కనే అనుమతుల్లేని నిర్మాణమా

## నిబంధనల అమలుపై ప్రజల్లో అనేక సందేహాలు

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 31 (జనం సాక్షి):**మండల కేంద్రంలోని అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి ఎదురుగా షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? లేదా? అనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.విచిత్రమేమిటంటే.. నిర్మాణం జరుగుతున్న ప్రాంతానికి కూతవేటు దూరంలోనే గ్రామ పంచాయతీ కార్యాలయం, పక్కనే మండల పరిషత్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పందించడం లేదనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి.సాధారణంగా నిర్మాణాలకు అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మరి ఈ షెడ్డు నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించారా? నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతుంటే ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణానికి సంబంధించిన అనుమతులను పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తా

## :సర్పంచ్ వర్త్య మహిపాల్

**మోమిన్ పేట అక్టోబర్ 31( జనం సాక్షి)**మోమిన్‌పేట మండల పరిధిలోని రాళ్లగుండుపల్లి గ్రామ సర్పంచ్‌పై కొందరు వ్యక్తులు చేసిన అవినీతి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గ్రామ సర్పంచ్ వర్త్య మహిపాల్ శనివారం స్పష్టం చేశారు. గ్రామంలో నల్లాల ఫిట్టింగ్ కోసం లంచం అడుగుతున్నారని, రైతు పొలంలో నుంచి మట్టి తరలించేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఫామ్‌హౌస్‌లకు వెళ్లి లంచాలు అడుగుతున్నారని, చెత్త సేకరణ విషయంలో గ్రామస్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన ఖండించారు.ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి ఆధారాలతో నిరూపించాలని, సమాచార హక్కు చట్టం ద్వారా అయినా తనపై చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే సర్పంచ్ పదవికి తక్షణమే రాజీనామా చేస్తానని వర్త్య మహిపాల్ సవాల్ విసిరారు.నిన్న కొందరు వ్యక్తులు తనపై ప్రెస్‌మీట్ నిర్వహించి పలు విమర్శలు చేశారని, చెత్త బండి పెట్టి కుంటున్నాడని గ్రామ సభలకు పిలవడం లేదని గ్రామంలో ఇతర సమస్యలపై కూడా నిరాధార ఆరోపణలు చేశారని ఆయన పేర్కొన్నారు. తాను ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ కావడంతో కొందరు ఓర్వలేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాళ్లగుండుపల్లి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ వర్త్య మహిపాల్‌తో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, ఆరోపణలు చేసిన వారు వాటిని నిరూపించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో చెన్నమ్మ, కిరణ్, శ్రీకాంత్, సుజాత,రాధా, రమేష్ నాయక్,మెగావత్ లక్ష్మి మెన్ నాయక్,సెవియ నాయక్,మెతిలాల్ నాయక్,వినోద్ నాయక్, శ్రీకాంత్ నాయక్,జి

# మౌలిక వసతులకు పెద్దపీట

## రూ.72.50 లక్షలతో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే మర్రి శ్రీకారం

**అల్వాల్, అక్టోబరు 31 (జనంసాక్షి):** మచ్చబొల్లారం డివిజన్‌లో రెండు కాలనీల్లో రూ.72.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. శక్తి గణేష్‌నగర్ కాలనీలో రూ.42.50 లక్షలు, చిన్నాన్న తోట కమ్యూనిటీ హాల్ రోడ్డులోని 3వ నంబరు వీధిలో రూ.30 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ డీఈ మహేష్, ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అష్ఫాక్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగించే 100 అడుగుల రోడ్డు వద్దు

## కాలనీవాసుల సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు

**రాజేంద్రనగర్,అక్టోబర్31(జనంసాక్షి)**నార్సింగ్ సర్కిల్ పరిధిలోని కోకాపేట సెవెన్ హిల్స్ వెస్ట్రన్ మిడోస్ కాలనీ నుంచి ప్రతిపాదించిన 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సెవెన్ హిల్స్ వెస్ట్రన్ మిడోస్ కాలనీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలే తప్ప, ఒక సంస్థ లేదా బిల్డర్ ప్రయోజనాల కోసం ఉండకూడదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 100 అడుగుల రహదారికి మార్కింగ్ చేశారని, 2013లో స్థానిక ప్రజలు హనుమాన్ దేవాలయం, అపార్ట్‌మెంట్లకు ఇబ్బందులు కలుగుతాయని అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అప్పటి మంత్రి సబిత ఇంద్రారెడ్డి చొరవతో కేసీఆర్‌తో చర్చించి, దేవాలయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పక్క నుంచి రహదారి వెళ్లేలా 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని గుర్తుచేశారు.అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 2026లో కొత్తగా ఇచ్చిన గెజిట్ వల్ల దేవాలయం, అపార్ట్‌మెంట్ వాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపించారు. రాధా రియాల్టీ హై-రైజ్ నిర్మాణానికి అనుకూలంగా రహదారి మార్పులు చేస్తున్నారంటూ విమర్శించారు అలాగే నార్సింగి సర్కిల్ పరిధిలో ప్రభుత్వ భూముల వ్యవహారంలో అక్రమాలు జరిగాయని, సుమారు రూ.150 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రూ.26 వేల కోట్లకే దక్కించుకునే వ్యవహారం వెనుక పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. గతంలో హైదర్‌షాకోట్‌లో మూసీ పరిరక్షణ పేరుతో పేదల ఇళ్లు, భూములు తొలగించే ప్రయత్నాలను స్థానికుల ఆందోళనతో అడ్డుకున్నామని పేర్కొన్నారు. దేవాలయ రహదారి, అపార్ట్‌మెంట్లను కూల్చి రహదారి నిర్మిస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు.వెంటనే 2026 గెజిట్‌ను రద్దు చేసి, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తామని తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే చట్టపరంగా పోరాటం చేస్తామని, అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని లేవనెత్తి అపార్ట్‌మెంట్ వాసులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి, గండిపేట బీఆర్ఎస్ నాయకులు పెద్దపులి కృష్ణ, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ముక్తార్, పర్వేదు రాజు, శ్రీకాంత్ రెడ్డి, దప్పు రవీందర్, ఎర్రోళ్ల ప్రకాష్, అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

**కాప్రా అక్టోబర్ 31 (జనం సాక్షి ) :** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొంది చడమే స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నారాయణ స్కూల్ ఏజీఎం పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. ఈసీఐఎల్ నారాయణ ఈ-టెక్నో స్కూల్, సీబీ ఎస్ సి ప్రిన్సిపల్ మంజు భార్గవి ఆధ్వర్యంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం పురుషోత్తం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా తాము నేర్చుకున్న పాఠ్యాంశాలు, విద్యాపరమైన పురోగతి, సాధించిన విజయాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి తమ తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.ఈ కార్యక్రమంలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులు, చార్టులు, ప్రయోగాలు, నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు తమ ప్రాజెక్టులను చక్కగా వివరించి తమ ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులే నిర్వహించిన కూరగాయలు, పండ్ల దుకాణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటి ద్వారా విద్యార్థులు వస్తువుల గుర్తింపు, ధరల అవగాహన, కొనుగోలు, అమ్మకాలు వంటి ఆచరణాత్మక అంశాలను నేర్చుకున్నారు.విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన ఆచరణాత్మక జ్ఞానాన్ని అందించే అద్భుతమైన వేదికగా నిలిచింది. విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని పిల్లల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ వారిని ప్రోత్సహించారు.అనంతరం ప్రిన్సిపల్ మంజు భార్గవి మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, తమ అభ్యసన సామర్థ్యాలను స్వయంగా గుర్తించి వివరించే నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తాయని తెలిపారు.

# ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## కార్మిక హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి--ఏఐటీయూసీ నాయకులు

**చేవెళ్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి)** ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చేవెళ్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.రామస్వామి మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న స్థాపించబడిన ఏఐటీయూసీ దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతతో పాటు ఎనిమిది గంటల పని విధానం అమలు కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ వంటి సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాలపై కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ స్థాపన నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం సాగిస్తున్న పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బూల్, బీకేఎం మండల ప్రధాన కార్యదర్శి శ్రీను, వివోఏ నాయకులు రవి, శ్రీనివాస్, హనుమంతు, యాదయ్య, పెంటయ్య, లలిత, మాధవి, అంజమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులు, బాధ్యతలు గుర్తించాలి

## మోమిన్ పేట ఎస్సై భరత్ భూషణ్

**మోమిన్ పేట అక్టోబర్ 31( జనం సాక్షి)**భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల తో పాటు బాధ్యతలను ప్రతి పౌరుడు గుర్తించాలనియు మోమిన్ పేట ఎస్సై భరత్ భూషణ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవను గ్రామ సర్పంచ్ గొల్ల కృష్ణవేణి గోవింద్ అధ్యక్షతన నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే రాజ్యాంగంపై అవగాహన కల్గి, చట్టాలను తెలుసుకొని ప్రవర్తించాలన్నారు. హౌరా హక్కుల దినోత్సవం గురించి పౌరులకు అవగాహన కల్పించేందుకు ప్రతినెల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సురేష్, కార్యదర్శి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబర్ 31 (జనం సాక్షి)**హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడు మర్రి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారత ఉక్కు మనిషి, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానమంత్రి, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ ఐక్యతకు పటిష్టమైన పునాదులు వేసిన పటేల్ చూపిన మార్గం నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా మహిళా నాయకురాలు పార్వతి, మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు గీత, సీనియర్ నాయకులు గోవింద చారి, శ్రీధర్ రెడ్డి, వెంకన్న, తిరుమలేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, విష్ణు, రీతిక్, మహిళా నాయకురాలు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శక్తిస్థల్‌లో ఇందిరాగాంధీకి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య నివాళులు

**చేవెళ్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి)** భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని శక్తిస్థల్‌లో ఆమె సమాధి వద్ద చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను, ఆమె నాయకత్వాన్ని స్మరించుకున్నారు. దేశ అభివృద్ధి, ఐక్యత, సమగ్రత కోసం ఆమె చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, దావల్గారి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లి కేజీబీవీలో ముందస్తు దీపావళి సంబరాలు

**కోట్‌పల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మార్వాడి యువ మంచ్ తాండూరు శాఖ ఆధ్వర్యంలో 'ఆనంద్ సబ్‌కే లియే' కార్యక్రమంలో భాగంగా ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్వాడి యువ మంచ్ జాతీయ కన్వీనర్ మన్మోహన్ సారద పాల్గొని విద్యార్థినులతో కలిసి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేసి, వారి విద్యాభివృద్ధికి భవిష్యత్తులో సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నీటి పొదుపు, భవిష్యత్తులో నీటి ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్వాడి యువ మంచ్ అధ్యక్షుడు కిషన్ గోపాల్ రాటి, కార్యదర్శి కరణ్ జైన్, ఇతర ప్రతినిధులు, సభ్యులు, పాఠశాల ప్రత్యేక అధికారిణి పల్లవి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద ఏకతా మహోత్సవంలో తాండూరు బీజేపీ నాయకులు

**తాండూరు అక్టోబర్ 31(జనంసాక్షి)** దేశ ఐక్యతకు చిహ్నంగా గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా నది తీరాన నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం స్టాట్యూ ఆఫ్ యూనిటీని సందర్శించడం ఎన్నో జన్మల పుణ్యఫలమని తాండూరు బీజేపీ నాయకులు అన్నారు. శనివారం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్న దేశ ఐక్యతా దినోత్సవం పురస్కరించుకుని గుజరాత్ లో నిర్వహించిన ఏకతా మహోత్సవం కార్యక్రమంలో తాము పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్, బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం మరియు వికారాబాద్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు, 33వ వార్డు కౌన్సిలర్ డి. శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమగ్రత కోసం చేసిన కృషి మరువలేనిదని, ఆయన స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ఐక్యతను చాటేలా ఈ విగ్రహాన్ని నిర్మించారని కొనియాడారు.

## బంట్వారంలో వర్షాభావంతో పశువులకు తాగునీటి కష్టాలు

**బంట్వారం అక్టోబర్ 31 జనం సాక్షి** .బంట్వారం మండలంలో వర్షాలు సరిగ్గా కురవక పోవడంతో పశువులకు మేత కొరత ఏర్పడి పశువుల కాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పచ్చగడ్డి దొరక్క పశువులను పోషించడం భారంగా మారిందని పశువుల కాపరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు సరిపడా మేత అందించలేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి పశువులకు ఉచితంగా పశుగ్రాసం, దాణా అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# మోడల్ స్కూల్స్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

### : మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

యాచారం, అక్టోబర్ 31(జనం సాక్షి )తెలంగాణ మోడల్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల సిబ్బంది ఎదుర్కొంటున్న సుదీర్ఘకాల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గున్గల్ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది డిమాండ్ చేశారు. మోడల్ పాఠశాలల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా గున్గల్ పాఠశాల ఆవరణలో సిబ్బంది ఐక్యంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ... మోడల్ పాఠశాలల సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతోనే నిరసన బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. ముందుగా నిర్ణయించిన కార్యాచరణ ప్రకారం అక్టోబర్ 30, 31 తేదీల్లో విధులకు హాజరవుతూనే నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 2, 3: మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు. నవంబర్ 4, 5, 6: జిల్లా ప్రాంగణాల్లో ధర్నాలు, నిరసనలు. నవంబర్ 10 నుండి 12 వరకు: స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు, శాసనసభ్యులకు వినతిపత్రాల సమర్పణ. నవంబర్ 17: హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి భారీ ధర్నా మరియు ముట్టడి కార్యక్రమం. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా శాంతియుత మార్గంలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గున్గల్ మోడల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది మరియు జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**శంకర్‌పల్లి,అక్టోబర్ 31(జనం సాక్షి)**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండలంలో శనివారం నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఓటర్లను నేరుగా కలిసి బీఆర్ఎస్ పార్టీ విధానాలను,గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని తెలిపారు. ప్రతి గ్రామం,ప్రతి వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటర్లను చైతన్యపరచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ రాంబాబు యాదవ్,మండల,మున్సిపల్ అధ్యక్షులు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి, బద్దం శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి,నర్సింలు మహాలింగాపురం సర్పంచ్ మాచన్న గారి రాఘవేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు వాసుదేవ్ కన్నా, శ్రీధర్, శ్రీనాథ్, ప్రభు గౌడ్, నరసింహారెడ్డి, మరియు మండలానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్ ఆంగ్ల విభాగం

### పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమం

### విద్యార్థులకు సుమారు 100 పుస్తకాల ఉచిత పంపిణీ

**హయత్‌నగర్, అక్టోబర్ 31 (జనం సాక్షి)**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలు, వాటి ద్వారా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా అంతర్జాతీయ ఏవియేషన్ రంగంలో నిపుణురాలైన ధనికుల మహిత హాజరై, విద్యార్థులకు యూపీఎస్సీ, టీఎస్పీఎస్సీ, ఎస్ ఎస్ సి, బ్యాంకింగ్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పోటీ పరీక్షల సన్నద్ధతకు ఉపయోగపడే ఐ ఏ సి ఈ స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు.సుమారు 100 పుస్తకాలను విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేయడం విశేషం.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సంబంధించిన అర్హతలు, పరీక్షల విధానం, సిలబస్, సన్నద్ధతకు అనుసరించాల్సిన వ్యూహాలు, సమయపాలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ దినపత్రికలు చదవడం, సమకాలీన అంశాలపై పట్టు సాధించడం ద్వారా జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పదజాలం, పఠన అవగాహన, తార్కిక ఆలోచనా సామర్థ్యం, సాధారణ జ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. విద్యార్థులు ఆన్‌లైన్ విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు మాక్ టెస్టులు రాయడం, గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయడం, క్రమబద్ధమైన అధ్యయన ప్రణాళికను రూపొందించుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషి, పట్టుదల, సమయపాలన ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు, పరీక్షల సన్నద్ధతకు సంబంధించిన తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, డా. యాదగిరి, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డా. మధు ధర్మపురి, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. వి. శేఖర్, డా. డి. మాక్స, డా. పి. విజయలక్ష్మి, పి. విద్యాసాగర్, డా. వి. కృష్ణమోహన్, డా. ఎ. దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, వారి భవిష్యత్తు లక్ష్యాల సాధనకు అవసరమైన అధ్యయన సామగ్రిని ఉచితంగా అందించడం ద్వారా ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది.

# ఉపాధ్యాయుల అడ్జస్ట్మెంట్‌తో మా పాఠశాలకు అన్యాయం

## దేవనూరు సర్పంచ్ పాఠశాల కమిటీ ఆవేదన

**యాలాల అక్టోబర్ 31(జనంసాక్షి)** వర్క్ అడ్జస్ట్మెంట్ కింద తమ పాఠశాల నుంచి ఓ టీచర్ ను వేరే పాఠశాలకు పంపించడం పట్ల తమ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యతో పాటు విద్యా బోధన కొరవడి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని యాలాల మండలం దేవనూరు సర్పంచు రేణుకా దేవి కిషన్ రావు మరియు ప్రాథమిక పాఠశాల సభ్యులు ఏకగ్రీవ తీర్మానం తో తెలియజేశారు. శుక్రవారం వచ్చిన పత్రిక వార్తకు స్పందించి పలు విషయాలు తెలియజేశారు. తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఎంతో నాణ్యమైన బోధన విద్యార్థులకు అందించడంతోపాటు పాఠశాల నిర్వహణ చక్కగా, ఆదర్శవంతంగా జరుగుతుందని సర్పంచ్ పాఠశాల కమిటీ వారు తెలియజేశారు. కాగా తమ పాఠశాల నుంచి వర్క్ అడ్జస్ట్మెంట్ కింద ఓ టీచర్ ను బషర్మీయా తండాకు పంపాలని అధికారుల నుంచి ఉత్తర రావడం వాస్తవం అన్నారు. దీనివల్ల తమ పాఠశాలకు విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా ఉపాధ్యాయ పోస్టులు సైతం కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు గ్రామం ఏకగ్రీవంగా తీర్మానించి ఉపాధ్యాయ పోస్టులు కాపాడుకునేందుకు వర్కర్ ఉత్తర్వులు ఉన్నతాధికారులకు డీఈఓ కు ఎంఈఓ కు తెలియజేశామన్నారు. దీనిని ఇతర పాఠశాలల నుంచి వర్కర్ జస్టిమెంట్ కింద పంపాలని సూచించామన్నారు. డీఈవో సైతం సానుకూలంగా

స్పందించడంతో వర్క్ అడ్జస్ట్మెంట్ టీచర్ను తమ పాఠశాలలో కొనసాగించుకుంటున్నట్లు వివరించారు. ఇందులో ఎలాంటి ఉపాధ్యాయుల తప్పిదం లేదని ఎలాంటి పైరవీలు కాదని గుర్తు చేశారు. తప్పుడు కథనాలతో ఆదర్శవంతమైన పాఠశాల ఉపాధ్యాయులను ఇబ్బందులు కు గురి చేయరాదని మనస్థాపానికి గురిచేయరాదని గుర్తు చేశారు. ఏ ఒక్క ఉపాధ్యాయుని తమ పాఠశాల నుంచి వర్క్ అడ్జస్ట్మెంట్ కింద పంపించిన విద్యా బోధన దెబ్బతింటుందని అన్నారు. కావున తమ పాఠశాల నుంచి వర్కర్స్మెంట్ కింద పంపేది లేదని తీర్మానించారు. త్వరలో జిల్లా కలెక్టర్ డీఈఓ ను కలిసి దీనిపై తమ పాఠశాలకు న్యాయం చేయాలని కోరుతామని అన్నారు. అందుకు ఎంఈఓ శాంతయ్య సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ లేబర్ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఏవీఎస్ఎస్ శాస్త్రి

## జిల్లా కో-కన్వీనర్‌గా బొంత శ్రీకాంత్ నియామకం

**ఎల్బీనగర్ అక్టోబర్ 31 (జనం సాక్షి)**బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సీనియర్ నాయకుల సూచనల మేరకు బొంత శ్రీకాంత్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ కార్మిక విభాగం జిల్లా కో–కన్వీనర్‌గా నియమించారు. అలాగే ఏవీఎస్ఎస్ శాస్త్రిని లేబర్ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించినట్లు అందె శ్రీనివాస్ వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ అందించిన సేవలను గుర్తించి ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. నూతనంగా నియమితులైన నాయకులు కార్మికుల సంక్షేమానికి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కార్మిక సెల్ ఇన్‌చార్జి పాలకుర్తి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పోరాటంలో ఏఐటీయూసీది ఘన చరిత్ర

## కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం

## సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 31 (జనం సాక్షి):**దేశ కార్మిక ఉద్యమ చరిత్రలో ఏఐటీయూసీకి ప్రత్యేకమైన స్థానం ఉందని, స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు సాగిస్తూ 107 ఏళ్ల ఘన చరిత్రను సొంతం చేసుకుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు.ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వేడుకలు నిర్వహించారు. సీపీఐ మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆందోజు రవీంద్ర చారి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఏఐటీయూసీకి ప్రత్యేకమైన పోరాట చరిత్ర ఉందన్నారు. రక్షణ, నౌకాశ్రయాలు, బ్యాంకులు, సింగరేణి, ఆర్టీసీతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కార్మికులకు అనుకూలంగా అనేక సంస్కరణలు రావడంలో ఈ సంఘం కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు.తెలంగాణ ఆర్టీసీ, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఉక్కు పరిశ్రమను జాతీయం చేయించడంలోనూ ఏఐటీయూసీ పోరాటాలు కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని

విమర్శించారు. పాత కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆరోపించారు.సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు వాటిని కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, పాత కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు అప్రజాస్వామిక విధానాలను విడనాడాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, బీకేసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, వార్డు సభ్యురాలు కేతరాజు మంజుల, జెన్నారం శాఖ కార్యదర్శి రమేష్ నాయక్, బీఓసీ నాయకులు సాయిలు, డౌల రాములు, సుజాత, ఆటో రాము, యాదగిరి, వాసిరెడ్డి లక్ష్మి, ఏనుగోటి లక్ష్మి, ప్రియా, కావేరి, అన్నపూర్ణ, లింగం, శ్రీను, ప్రభాకర్, అనూష, సునీత తదితరులతో పాటు ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

# మిర్చి బండి స్థాయి నుండి ఢిల్లీ డాక్టరేట్ వరకు

## చౌదర్‌పల్లి వాసి ఫిరోజ్ ఖాన్ కు డాక్టరేట్

**యాచారం, అక్టోబర్ 31(జనం సాక్షి )**యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఫిరోజ్ ఖాన్ కు అరుదైన గౌరవం లభించింది. సమాజానికి ఆయన చేసిన విశిష్ట సేవా కార్యక్రమాలను గుర్తించి, ఢిల్లీకి చెందిన ప్రముఖ 'ద అచీవర్స్ అవార్డు కౌన్సిల్' సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు ఫిరోజ్ ఖాన్ కు ఈ అవార్డును అందజేశారు.ఫిరోజ్ ఖాన్ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. యాచారంలో తన తండ్రి నడిపే మిర్చి బండి వద్ద సహాయం చేస్తూనే, తీవ్ర ప్రతికూల పరిస్థితులలో ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తూనే, తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఆయన పడుతున్న శ్రమను, గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రకటించడం పట్ల చౌదర్‌పల్లి గ్రామస్థులు, మండల ప్రజలు మరియు మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడే మనస్తత్వంతో పాటు సమాజం పట్ల ఉన్న తపన ఆయనను ఈ స్థాయికి చేర్చిందని, ఫిరోజ్ ఖాన్ కు డాక్టరేట్ రావడం యాచారం మండలానికి గర్వకారణమని పలువురు కొనియాడారు.

# డాక్టర్ ఏ.ఎస్. రావు గారి సేవలు చిరస్మరణీయం

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, అక్టోబర్ 31 (జనం సాక్షి ) :** డాక్టర్ ఏ.ఎస్. రావు గారు సమాజానికి అందించిన సేవలు, ప్రజల సంక్షేమం పట్ల చూపిన నిబద్ధత, అభివృద్ధి కోసం చేసిన కృషి ఎప్పటికీ మరువలేనివని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ ఏ.ఎస్. రావు వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ ఏ.ఎస్. రావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ ఏ.ఎస్. రావు సమాజానికి అందించిన సేవలు, ప్రజల సంక్షేమం పట్ల చూపిన నిబద్ధత, అభివృద్ధి కోసం చేసిన కృషి ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఒక మహనీయుడిగా, ప్రజాసేవకుడిగా ఆయన సమాజంపై చెరగని ముద్ర వేశారని అన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు, సేవా స్ఫూర్తి నేటి తరానికి మాత్రమే కాకుండా భావితరాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.ప్రజల అభ్యున్నతి, సమాజ పురోగతి కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని, వారి సేవలను గుర్తుచేసుకుంటూ వారు చూపిన మార్గంలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. డాక్టర్ ఏ.ఎస్.

రావు పేరు మీద ఏర్పడిన ఈ ప్రాంతం ఆయన సేవలను నిరంతరం గుర్తుచేస్తూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , మాజీ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బండ్లగూడ జాగీర్‌లో ఘనంగా సర్దార్ పటేల్ జయంతి వేడుకలు



**రాజేంద్రనగర్,అక్టోబర్31(జనంసాక్షి)**బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు మహాలింగం గౌడ్ నివాసం వద్ద పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్ ముదిరాజ్ పాల్గొని దేశ ఐక్యత, సమగ్రత కోసం పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ బండ్లగూడ జాగీర్ అధ్యక్షుడు కొండె మహేష్ యాదవ్, నరేష్ యాదవ్, మహాలింగం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మల్లారెడ్డి, గోపీ గౌడ్, భగవంత్ రెడ్డి, వెంకటేష్, అభినయ్ గౌడ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు, బోనస్, ఇంక్రిమెంట్లు చెల్లించే వరకు విధులకు దూరం

### మిషన్ భగీరథ కార్మికుల విధుల బహిష్కరణ

**కొడంగల్, అక్టోబర్ 31 (జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గ పరిధిలో మిషన్ భగీరథ పథకం కింద పనిచేస్తున్న సుమారు 100 మంది కార్మికులు శనివారం నుంచి విధులను బహిష్కరించారు. తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు బోనస్, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్మికులు తెలిపారు.కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్ పేట్, దుద్యాల మండలాలకు చెందిన మిషన్ భగీరథ కార్మికులు ఈ విధుల బహిష్కరణలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వేతనాలు, బోనస్, ఇంక్రిమెంట్లు అందించే వరకు విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొడంగల్ ఎంపీడీవో ఉషశ్రీ మేడంకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కార్మికులు కోరారు.

## ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

### మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్

**కేశంపేట అక్టోబర్ 31 (జనం సాక్షి ) :** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సంబరాజు బాలకిషన్ రావు తిమ్మాజీపేట మండలం మారేపల్లి లో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తో పాటు మాజీ జెడ్పిటిసి పల్లె నర్సింగ్ రావు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వర్గాల లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు జగన్మోహన్ రెడ్డి, కానం ప్రేమ్ కుమార్ గౌడ్, సుధాకర్, మహిపాల్ రెడ్డి, కరుణాకర్, దశరథ్ తదితరులు హాజరయ్యారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు బాలకిషన్ రావును సన్మానించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## తాండూరు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు పురోగతిపై ఆరా

**తాండూరు ఆక్టోబర్ 31(జనంసాక్షి)**హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై తాజా సమాచారం తెలుసుకునేందుకు ఎన్నికల తాండూరు సమన్వయకర్త విప్లవ్ కుమార్, తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డితో కలిసి తాండూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అధికారి, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కర్ర అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్ చారి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, మూడు మండలాల అధ్యక్షులు నర్సిరెడ్డి, వీరేందర్ రెడ్డి, కోహిర్ శ్రీనివాస్, పెద్దేముల్ సర్పంచ్ డి.వై. నర్సింలు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పెట్లోళ్ల దీపా నర్సింలు, టౌన్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ సలీం, మహిళా నాయకురాలు శోభారాణి పాల్గొన్నారు.

## చేవెళ్ల కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం

### న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి వైద్య పరీక్షలు ఉచితంగా మందుల పంపిణీ

**చేవెళ్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి)** మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో, అత్తాపూర్‌లోని జర్మన్ టైం హాస్పిటల్ సహకారంతో చేవెళ్ల కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, సీనియర్ న్యాయమూర్తి దశరథ రామయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ శిబిరంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి వైద్యులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాటి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డగ్స్, గంజాయి నిర్మూలనే లక్ష్యం

### : అలియాబాద్, ఎంసి పల్లి మున్సిపల్ ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్ రాజ్యలక్ష్మి

**శామీర్ పేట్, అక్టోబర్ 31(జనంసాక్షి )**అలియాబాద్ ఎంసి పల్లి మున్సిపాలిటీల ల్లో యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తున్నామని ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం లాల్ గడి మలక్ పేట్ ఎక్సయిజ్ కార్యాలయంలో మీడియా సమావేశం లో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలల్లో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు అహర్నిశలు పాటుపడు తున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ లో బెల్ట్ షాపులను నియంత్రిస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎస్సై నరేష్ కుమార్ పాల్గొన్నారు.

## దివ్యంగ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకే ఆటల పోటీలు

### :ఎంసి పల్లి ఎం ఈ ఓ భాగ్యమణి

**శామీర్ పేట్, అక్టోబర్ 31(జనం సాక్షి )** మూడు చింతలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ లో మండలంలోని దివ్యాంగుల పిల్లలందరికీ మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ యొక్క పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.అదేవిధంగా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ నీ అందరికీ అందచేశారు . ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి భాగ్యమని ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులకు సూచనలు సలహాలు అందజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి సుమారుగా 30 పిల్లలు,హై స్కూల్ హెచ్ఎం , ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీకాంత్ చారి, సిఆర్ పి గోవర్ధన్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాష్టాల గడ్డ స్మశాన వాటికలో అక్రమ కంటైనర్లు తొలగించాలి

**రాజేంద్రనగర్,అక్టోబర్31(జనంసాక్షి)**నార్సింగి గ్రామంలోని పురాతన కాష్టాల గడ్డ స్మశాన వాటిక స్థలంలో కేడీఆర్ నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన రెండు కంటైనర్లను తొలగించి, స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ నార్సింగి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ గ్రామస్తులతో కలిసి నార్సింగి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి, కేడీఆర్ సంస్థ అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉషారాణి, కె.సుమన్, సి.రము, వెంకట్, జె. అశోక్, కె.పి. రావు, కె. సత్యనారాయణ పి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**అల్వాల్, అక్టోబరు 31(జనంసాక్షి):**పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ రాములుతో కలిసి ఆయన 38 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌదర్పల్లి ఆంజనేయ స్వామి ఆలయ నక్షా దారి కబ్జాపై రైతుల ఆందోళన

### మాజీ ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేత

**యాచారం, అక్టోబర్ 31(జనం సాక్షి )**మండలంలోని చౌదర్పల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే పురాతన నక్షా దారి అక్రమ కబ్జాకు గురైందని, వెంటనే అధికారులు స్పందించి దారిని పునరుద్ధరించాలని చౌదర్పల్లి గ్రామ రైతులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సాగర్ హైవే నుండి యాచారం రెవెన్యూ సర్వే నంబర్లు 53, 54 మరియు చౌదర్పల్లి రెవెన్యూ సర్వే నంబర్లు 63, 64ల మధ్య నుంచి ఆలయానికి, గ్రామానికి వెళ్లే ఈ దారి కొన్ని సంవత్సరాలుగా వాడుకలో ఉందని తెలిపారు. అయితే గత సంవత్సరం నుండి ఈ నక్షా దారిని కొందరు కబ్జా చేయడంతో భక్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్‌లకు వినతిపత్రాలు ఇచ్చినట్లు పేరొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి, ఆక్రమణలు తొలగించి, నక్షా దారిని కాపాడి తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా రైతులు, భక్తులు డిమాండ్ చేశారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### బీజేపీ మండల అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్

**కేశంపేట, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** ఎల్-నినో ప్రభావంతో పంట నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్న శ్రీనివాస్, రైతుల పంట పొలాలను పరిశీలించారు.రైతులతో మాట్లాడి వారు పండించే పంటలు,ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.త రచూ విద్యుత్ కోతలు, విద్యుత్ హెచ్చుతగ్గులతో పంటలకు నీరు అందడం లేదని రైతులు శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా నీటి సంరక్షణకు కృషి చేస్తే కరువు ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో తట్టెపల్లి నరసింహ, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్ గౌడ్

**చేవెళ్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి)** ఇందిరాగాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళగా పేరుగాంచిన దివంగత ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆమె విశేష కృషి చేశారని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న గొప్ప నాయకురాలిగా ఆమె ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలకు ఇందిరాగాంధీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఆమె చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బక్కరెడ్డి రవీందర్ రెడ్డి, ఖాన్ పాషా, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అజీమ్, మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి మాణిక్యం, మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గనీ, నాయకులు ఖదీర్, నజీమ్, సాయి వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బాలల రక్షణ, సైబర్ భద్రతపై అవగాహన

### ఉప్పల్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కరరావు

**ఉప్పల్, అక్టోబర్ 31 (జనం సాక్షి):** విద్యార్థుల్లో బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చేందుకు ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరవనీయ ప్రధాన జిల్లా న్యాయమూర్తి బాల భాస్కరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ప్రతినిధి ప్రియాంక, మల్కాజిగిరి పోలీసు అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల రక్షణ, సైబర్ భద్రత, సామాజిక బాధ్యతలపై పలు కీలక అంశాలను వివరించారు. ముఖ్యంగా చిన్నారులపై జరిగే లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, బాలల హక్కులు, ఆపద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు విషయాన్ని తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని వివరించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని అధికారులు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై పడే ప్రభావాలను వివరించారు. స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలని, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించు కోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతరోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు అధికారులు విద్యార్థులకు వివరించారు. రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్ వినియోగం, రహదారి భద్రత, వాహనదారుల బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు రక్షణ.. ప్రతి ఒక్కరికీ సాధికారతబాలల భద్రత అనేది కేవలం కుటుంబం లేదా పాఠశాల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహద పడతాయని తెలిపారు. మల్కాజిగిరి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చట్టాలపై, బాలల రక్షణపై, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి బిడ్డను రక్షించడం, ప్రతి ఒక్కరినీ శక్తివంతం చేయడం అనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### 75 యూనిట్ల రక్తం సేకరణ.. రక్తదానం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువత

**జవహర్ నగర్ (జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల దినోత్సవం ముగింపు సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్‌లోని రోజ్ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్, కీసర, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ డివిజన్ ఏసీపీ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, కీసర ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. మొత్తం 75 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌చార్జ్ రామకృష్ణ, సిబ్బంది, పోలీసు అధికారులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పట్టా బద్రులు ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోండి

### పరిగి ఆత్మ కమిటీ డైరెక్టర్ గుజ్జ రాజశేఖర్ రెడ్డి

**దోమ అక్టోబర్ 31 జనం సాక్షి..** దోమ..పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టా బద్రులు గా తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పరిగి ఆత్మ కమిటీ డైరెక్టర్ గుజ్జ రాజశేఖర్ రెడ్డి శనివారం నాడుఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరు మీడియా ప్రతినిధులు సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పాల్గొనేందుకు తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని తెలియజేశారు. ప్రభుత్వం తెలియజేసిన నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువ పత్రాలతో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తమతో పాటు ఇతర అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలని కోరారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని పట్ట భద్రులునువారు కోరారు.

## తొండుపల్లిలో బస్టాప్, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలి

### అధికారులు తక్షణమే స్పందించాలి

**శంషాబాద్, అక్టోబర్31(జనంసాక్షి)** శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి జాతీయ రహదారిపై పాదచారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి బైతి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై బస్టాప్‌లు, ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో పాటు దెబ్బతిన్న డివైడర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి బస్టాప్, ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పండగవేళ నోటి పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం

### ప్రముఖ దంత నిపుణులు డాక్టర్ సోనియా దత్తా

**ఖైరతాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** దీపావళి పండుగ సమయంలో స్వీట్లు, స్నాక్స్ అధికంగా తీసుకోవడం వల్ల దంతక్షయం, చిగుళ్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రముఖ దంత నిపుణులు డాక్టర్ సోనియా దత్తా తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, పళ్ల మధ్య శుభ్రం చేసుకోవడం, తీపి పదార్థాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని కాపాడ కోవచ్చన్నారు. డాబర్ రెడ్ పేస్ట్‌లోని లవంగ నూనె, తామర బీజం (జాంతోక్సిలమ్), పుదీనా సత్వ వంటి ఆయుర్వేద పదార్థాలు నోటి పరిశు భ్రతకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఇండియన్ డెంటల్ అసోసి యేషన్(ఐడీఏ) ఆమోదం పొందిన డాబర్ రెడ్ పేస్ట్‌ను రోజువారీ దంత సంరక్షణలో ఉపయోగించవచ్చని సూచించారు.

## ఊపిరితిత్తుల సమస్యతో కార్మికుడికి అస్వస్థత

### తక్షణమే స్పందించిన కౌన్సిలర్, ఆర్థిక సాయం అందించిన చైర్‌పర్సన్

తాండూరు అక్టోబర్ 31(జనంసాక్షి) మున్సిపల్ పరిధిలోని పాత తాండూరు 15వ వార్డ్ కు చెందిన మున్సిపల్ కార్మికుడు జె. నవీన్ కుమార్ ఊపిరితిత్తుల సమస్యతో అస్వస్థతకు గురయ్యారు. మెరుగైన అత్యవసర వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.. ఆపద సమయంలో చొరవ చూపి ఆర్థికంగా ఆదుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ దివిటి ఎల్లప్పలకు బాధితుడి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కూకట్‌పల్లిలో భారీగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు బండి రమేష్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 31(జనంసాక్షి):** ఉమ్మడి హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయాన్ని లక్ష్యంగా కేపీహెచ్‌బీ కాలనీ రమ్యా గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటరు నమోదుకు ఆసక్తి చూపారు. రంగమోహన్, నలినీకాంత్, రవి, కళ్యాణ్, రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఓటరు నమోదు ప్రక్రియలో సహకరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపిశెట్టి రాఘవేందర్, ప్రకాష్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, తూము మనోజ్ కుమార్, ఇజాజ్, రమణ, అస్లాం, ఫణిందర్, నవాజ్, సల్మాన్ పాషా, లక్ష్మణ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ బచావో - దేశ్ బచావో మహా ర్యాలీకి

### అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నేతల పయనం

**డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు**

**శామీర్ పేట్, అక్టోబర్ 31(జనం సాక్షి )**దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి హాజ రయ్యేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఢిల్లీకి బయలుదేరారు. ఇందులో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చేర్మెన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్,అలియా బాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్,తుంగతుర్తి రవి,రాఘవేంద్ర గౌడ్,కంఠం కృష్ణ రెడ్డి,కౌడె మహేష్,భూమి రెడ్డి నవీన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఢిల్లీకి పయనమయ్యారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నిర్వహించనున్న ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లు, మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు భాగస్వామ్యం అయ్యాయి.

## డీడీ కట్టి సీఎంకు లేఖ రాయాలి

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సవాల్

**జడ్చర్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి):** మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శనివారం ప్రెస్ మీట్‌లో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా స్పందించారు. తన భార్య పట్టా భూమి ని లాక్కోవాలని చూస్తున్నారని, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భూదందాలు చేసిన వారే ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారని అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. ఆసుపత్రికి రూ. 25 కోట్లు ఇస్తానంటున్న లక్ష్మారెడ్డి, ముందుగా డీడీ కట్టి సీఎంకు లేఖ రాయాలని, జీవో వచ్చాక ఒరిజినల్ డీడీ ఇవ్వాలని సవాల్ విసిరారు. జెడ్పీ చైర్మన్ పదవి ఇస్తామన్నా పార్టీ మారలేదని, లక్ష్మారెడ్డి కాదా అని ప్రశ్నించారు. గంట సేపు మాట్లాడడం కాదు, ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

**: ఎంసి పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం**

**శామీర్ పేట్, అక్టోబర్ 31(జనం సాక్షి )**మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశం ఆధ్వర్యంలో శనివారం రోజు కొల్తూరు గ్రామంలో భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దోసకాయల వెంకటేశం మాట్లాడు తూ..భారతదేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ గారు చేసిన సేవలు చిరస్మరణీయ మని కొనియాడారు. దేశాభివృద్ధి కోసం ఆమె తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు భారత చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమె చూపిన మార్గంలో నడుస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, బసవ రెడ్డి, బాలకృష్ణ, నర్సారెడ్డి, జైపాల్ రెడ్డి, శిల్ప యాదగిరి, అనంతరెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకటేశం, ఆంజనేయులు, రాజు, పాండరీ, నర్సింలు శ్రీకాంత్ గౌడ్, శ్రీశైలం, నరసింహులు, మాజీ సర్పంచ్ వీరేశం, బాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

# బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

**. డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి చేసి చూపిస్తాం: ఎంపీ డీకే అరుణ**

**కొడంగల్, అక్టోబర్ 31 (జనం సాక్షి):** కొడంగల్ పట్టణ కేంద్రంలోని బీజేపీ సీనియర్ నాయకుడు పూనం చంద్ లహోటి నివాసంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొడంగల్ ప్రజల రుణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటికీ తీర్చుకోలేరని అన్నారు. కొడంగల్ ప్రజలు ఆదరించి గెలిపించడం వల్లే ఆయన ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారని, ఈ విషయాన్ని మర్చిపోకూడదని పేర్కొన్నారు. కొడంగల్ ప్రజల పట్ల కృతజ్ఞత చూపించాలంటే నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని, ఇళ్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చారని, ఈసారి భారతీయ జనతా పార్టీకి కూడా అవకాశం కల్పించాలని ఆమె ప్రజలను కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కూడిన డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,సీనియర్ నాయకులుపూనం చంద్ లహోటి, ప్రతాప్ రెడ్డి, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం

**ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవంలో కే.రవిచంద్రన్ పిలుపు**

**అల్వాల్, అక్టోబరు 31 (జనంసాక్షి):**కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కే.రవిచంద్రన్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యాప్రాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం కార్మికుల హక్కులకు విఘాతమని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరణ జరిగే వరకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, అసంఘటిత కార్మికులకు నెలకు రూ.9 వేల కనీస పింఛను ఇవ్వాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాస్ దాస్‌గుప్తా ఏడో వర్ధంతిని యాప్రాల్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఏఐటీయూసీ అల్వాల్ మండల అధ్యక్షుడు బి.నరేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అల్వాల్ పట్టణ పార్టీ కార్యదర్శి అమరావతి బాబు, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ సింగ్, సీహెచ్.తులసి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ కార్యదర్శి వై.వెంకటేష్, పి.చంద్రయ్య, నర్సింగ్‌రావు, సీనియర్ నాయకుడు ఏ.సురేష్, భవన నిర్మాణ మేస్త్రీ సంఘం అధ్యక్షుడు సాంసన్, యాప్రాల్ అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటలు కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే

### రాష్ట్ర మాజీ హోంమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాశీం బౌలిలో బీఆర్ఎస్ జెండా పండుగ

**మొయినాబాద్,అక్టోబర్31, జనంసాక్షి:**తెలంగాణ రాష్ట్రంలో రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ అని రాష్ట్ర మాజీ హోంమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కాశీం బౌలి గ్రామంలో బీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాన్ని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ రాజేందర్రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సబితా ఇంద్రారెడ్డి హాజరై జెండాను ఎగరవేశారు. జెండా పండుగలో పాల్గొన్న మహిళలు, రైతులతో ఆమె కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత కేసిఆర్ అని సూచించారు. కాంగ్రెస్ వచ్చిన తరువాత పంటలు పండించొద్దు, వ్యవసాయం దండుగ అనే గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏదో చేస్తాం, అర్ధులందరికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన గొప్పలు నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నామాలు పెడుతూ నిరుద్యోగులుగా మిగిలిస్తున్నారన్నారు. రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 5 వేలు ఇస్తే ఎన్నికల హామీల్లో 15 వేలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రైతు బంధులో కోతలు పెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం చుట్టు పక్కన ఉన్న రాష్ట్రాల్లో కరువు ఉండదు, తెలంగాణ రాష్ట్రంలో కరువు ఎలా ఏర్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులు, కుంటల పూడికలు తీయించి కురిసిన వర్షాన్ని నింపడం ద్వారా రైతులకు, ప్రజలకు నీటి సమస్య రాలేదని గుర్తుచేశారు. గ్రామాల్లో మహిళలు రోడ్లపై నల్లాల వద్ద నీళ్లు పట్టుకొని వస్తుంటే మహిళల బాధలను అర్థం చేసుకున్న అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ అని అన్నారు. ఇప్పుడు కరెంటు కోతలే కాదు నీటి కోతలు

సైతం ఏర్పాడుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీపై విరక్తి చెంది చాలా మంది మాజీ సర్పంచ్ లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ లో చేరుతున్నారన్నారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను తెలుసుకోని రానున్న ఎన్నికల్లో బీఆర్ఎఎస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్ లో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంపల్లి అనంతరెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దారెడ్డి వెంకట్రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొట్ల నరోత్తంరెడ్డి, అఖిత భారత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు చింతకింది ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, నాయకులు మత్తాల సురేందర్ గౌడ్, సిద్ధంతి నర్సింహ్మా, అంజయ్య గౌడ్, విజయేందర్రెడ్డి, కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణే ఏఐటీయూసీ లక్ష్యం

### 107వ ఆవిర్భావ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ.. కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి: సీపీఐ దర్శనం యాదగిరి

**జవహర్ నగర్, అక్టోబర్ 31 (జనంసాక్షి):**కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని సీపీఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భవించి 107 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జవహర్ నగర్ ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 107వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాప్రా మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దర్శనం యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం ఏఐటీయూసీ అహర్నిశలు కృషి చేస్తోందని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అనంతరం అంబాల ఎల్లయ్య మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు ఏఐటీయూసీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి, న్యాయమైన హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతుందని

స్పష్టం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి నాయకులు వెంకటాచారి, జవహర్ నగర్ బీసీ హక్కుల సాధన సమితి నాయకులు సోమాచారి, మహిళా సమాఖ్య కాప్రా మండల అధ్యక్షురాలు కోదాస్ జయమ్మ, నాయకురాలు టి. మాధవి, డప్పు ప్రకాష్, ఆటో యూనియన్ నాయకులు యాదగిరి, మహేష్, రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవి తాండూరు ముద్దుబిడ్డ కల్వ సుజాతకే ఇవ్వండి

### సీఎంకు ఆర్యవైశ్య మహాసభ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు దేవగారి రమేష్ కుమార్ వినతి.

**తాండూరు అక్టోబర్ 31(జనంసాక్షి)**గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకి కేటాయించాలని ముఖ్యమంత్రి కి మనవి చేస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు దేవగారి రమేష్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశ్య కులంలో రాజకీయంగా చాలా తక్కువ పర్సెంటేజ్ గా పదవులు వస్తుంటాయి. కానీ కల్వ సుజాత సేవాపరంగా, రాజకీయపరంగా చాలా అనుభవం కలిగిన సీనియర్ నాయకురాలు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో అలుపెరగని పోరాటం చేస్తూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా ఆమె వంతు కృషి చేశారని కొనియాడారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కండువా మార్చుకోకుండా పార్టీ కొరకు కష్టపడుతున్న ఆర్యవైశ్య తాండూరు ముద్దుబిడ్డ కల్వ సుజాత ముఖ్యమంత్రికి సన్నిహితురాలు కూడా. మంచి స్థానంలో ఆమెను గుర్తించి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ గా ఇచ్చి గౌరవించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గవర్నర్ కోటాలో కూడా మా ఆర్యవైశ్యులకు సంబంధించిన నేతకు, నాయకురాలికి ఎమ్మెల్సీ పదవి దక్కాలని మా మనవి. మా ఆర్యవైశ్యులకు న్యాయంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలను అధికారికంగా ప్రకటించడం మరియు ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం మాకు దక్కిన గౌరవం. ముఖ్యమంత్రిపై మాకు

ఆర్యవైశ్యులకు నమ్మకం ఉంది. రాజకీయంగా ఆర్యవైశ్యులను గుర్తిస్తున్నందుకు ఇప్పుడు కూడా ఆయనపై నమ్మకంతో ఈ వినతి పెడుతున్నామని దేవగారి రమేష్ కుమార్ అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేయడం హర్షనియమని సర్పంచ్ మద్యపాగా కృష్ణ అన్నారు

**మొయినాబాద్ జనం సాక్షి అక్టోబర్31:**పరిధిలోని అండాపూర్ ప్రభుత్వ పాఠశాలకు రెండవసారి నిధులు శాంక్షన్ కావడం ఎంతో సంతోషమని సర్పంచ్ కృష్ణ వెల్లడించారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని స్పష్టం చేశారు ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఉంటారని వారికి అండగా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు ఉత్తమ విద్యార్థులను ప్రోత్సాహాలతో సత్కరించాలని సూచించారు గ్రామంలో రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని వెల్లడించారు పంచాయతీ పాలకవర్గం గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జితేందర్ రెడ్డి వార్డు సభ్యులు నాయకులు మధు శ్రీనివాస్ జగన్ శ్రీకాంత్ గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు

## నేడు చేవెళ్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉదయం

**చేవెళ్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి):** విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల నేపథ్యంలో నవంబర్ 1వ తేదీ ఆదివారం చేవెళ్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చేవెళ్ల విద్యుత్ శాఖ ఏఈ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33 కేవీ కందవాడ, 33 కేవీ చేవెళ్ల విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు, అవసరమైన నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత గ్రామాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు, రైతులు ముందస్తుగా అప్రమత్తమై విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. నిర్వహణ పనులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పూర్తయితే విద్యుత్ సరఫరాను ముందుగానే పునరుద్ధరిస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేత వల్ల కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

## రామానుజన్ గణిత ఒలంపియాడ్‌లో జయ విద్యార్థుల ప్రతిభ

**సూర్యాపేట (జనంసాక్షి):**రామానుజన్ గణిత అకాడమి రామచంద్రాపురం వారు నిర్వహించిన గణిత ఒలంపియాడ్ లో తమ పాఠశాలకు చెందిన 94 మంది విద్యార్థులు రెండవ లెవెల్ కు అర్హత సాధించినట్లు జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుండి 13 మంది విద్యార్థులు, 6వ తరగతి నుండి 11 మంది విద్యార్థులు, 7వ తరగతి నుండి 17 మంది విద్యార్థులు, 8వ తరగతి నుండి 19 మంది విద్యార్థులు, 9వ తరగతి నుండి 19 మంది విద్యార్థులు, 10వ తరగతి నుండి 15 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## నేషనల్ హైవే పై గంజాయి పట్టివేత

**కోదాడ,( జనం సాక్షి):**తెలంగాణ ఈగల్ ఫోర్స్, కోదాడ టౌన్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ తో కోదాడ హైవేపై 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు సమాచారం. కాకతీయ సేవా సమితి సమీపంలో హోండా సిటీ కారులో తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి కారులో 62 ప్యాకెట్లలో తరలిస్తున్న 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సుమారు 75 లక్షలు ఉంటుందని అంచనా, గంజాయి రవాణాకు ఉపయోగించిన హోండా సిటీ కారు సీజ్ చేశారు. కర్ణాటకకు చెందిన సెల్వ సూర్య (26), రాజా గౌండర్ మురుగన్ (42) అరెస్టు చేశారు. ఒడిశాలోని చిత్రకొండకు చెందిన రాజు నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి.

# ఉప్పల్ జోన్‌లో ఇద్దరు చోరుల అరెస్ట్

## 20 రోజుల్లో 10 చోరీలు.. 37 తులాల బంగారం స్వాధీనం

### విలాసవంతమైన జీవితం కోసం మహిళ దొంగతనాలు.. గుర్తింపు దాచేందుకు బురఖా ధరించిన నిందితురాలు

**ఉప్పల్, అక్టోబర్ 31 (జనం సాక్షి):** ఉప్పల్ జోన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి సుమారు 37 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు వేర్వేరు కేసుల్లో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నవీన్ అనే నిందితుడు జైలు నుంచి విడుదలైన వెంటనే తిరిగి దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కేవలం 20 రోజుల వ్యవధిలోనే 10 చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి నుంచి సుమారు 37 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో కేసులో జయ అనే మహిళను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. చదువును మధ్యలోనే నిలిపివేసిన ఆమె, భర్తకు తెలియకుండా ఆన్‌లైన్ ద్వారా చోరీలకు సంబంధించిన పద్ధతులను నేర్చుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విలాసవంతమైన జీవితం గడపాలనే ఆశతో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చోరీల సమయంలో తన గుర్తింపు బయటపడకుండా బురఖా ధరించి నేరాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసులకు సంబంధించి నిందితుల నేరాల వివరాలు, ఇతర అంశాలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సీఇసి జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయాలి

## ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

### ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష,కార్యదర్శి హరీష్,ఎండి అన్వర్

**బోడుప్పల్-జనంసాక్షి :** ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని దేశంలో 13 కోట్ల ఓట్ల తొలగింపునకు కారణమైన భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్టు చేయాలని, "సర్" ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి,జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ డిపో వద్ద నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు, హరీష్, ఎండి అన్వర్ లు మాట్లాడుతూ కేంద్రం లో ఉన్న బిజెపి ప్రభుత్వం సిఇసి జ్ఞానేష్ కుమార్ ను అడ్డు పెట్టుకొని దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించడం జరిగింది. 2023 లో చట్టాలను సవరించి సిఇసి జ్ఞానేష్ కుమార్ పై పదవీ అనంతరం కూడా ఎట్లాంటి క్రిమినల్, సివిల్ దావా వేయడానికి వీలులేకుండా మరియు విచారణ లేకుండా చేసి ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తీసీవేసే కుట్రలు చేసిందని, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14 సమానత్వపు హక్కును, ఆర్టికల్ 326 ఓటును కలిగి ఉండే హక్కు కేంద్ర ప్రభుత్వం సర్ ప్రక్రియ ద్వారా కాలరాస్తుందని, తెలంగాణలో ఇప్పటికే 53 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తొలగించడం ద్వారా బిజెపి, ఆరెస్సెస్ లు దేశంలో రెండు రకాల పౌరసత్వాలను తీసురావాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. "సర్" ప్రక్రియకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలకు సమాధానం చెప్పలేక బయపడి "జంతర్ మంతర్" ను ఎత్తివేయడాన్ని, ఆర్టికల్ 19 ఫ్రీడం ఆఫ్ స్పీచ్,సమావేశాన్ని ఏర్పాటు చేసుకునే హక్కును హరిందాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశమే ఒక జంతర్ మంతర్ గా ఏర్పడి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సర్ ప్రక్రియ వల్ల జరుగుతున్న మోసాల పట్ల చైతన్యం చేస్తూ పోరాటాలను గ్రామాలకు విస్తరించి జ్ఞానేష్ కుమార్ ని అరెస్టు చేసి,ఓట్ల చోరి పై న్యాయ విచారణ జరిపించేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, జిల్లా నాయకులు, కృష్ణ, శ్రీకాంత్, రామ్ చరణ్, అభిషేక్, శివమణి, నిఖిల్, అరవింద్, శీను తదితరులు పాల్గొన్నారు.

# శ్లోక ద స్కూల్, మణికొండలో ఘనంగా 'అన్వయ - ఎడ్యుఫెయిర్'

**మణికొండ, అక్టోబర్ 31: ( జనం సాక్షి)**

మణికొండలోని ప్రతిష్టాత్మక 'శ్లోక ద స్కూల్'లో శనివారం విద్యార్థుల అద్భుత ప్రతిభతో 'అన్వయ' పేరుతో ఎడ్యుఫెయిర్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని, సృజనాత్మకతను, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్త, పరిశోధకులు, ప్రొఫెసర్ డాక్టర్ రవిచంద్ర గుండకరం గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల చైర్మన్ శ్రీ వెంకట్ రెడ్డి గారు, డైరెక్టర్ శ్రీమతి వినోదా రెడ్డి గారు, ప్రిన్సిపల్ శ్రీమతి తనుశ్రీ విశ్వాస్ గారు ముఖ్య అతిథికి సాదర స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య అతిథి విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ ప్రయోగాలు, నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. ఆర్గానిక్ ఫార్మింగ్, వర్షపు నీటి సంరక్షణ, సౌర కుటుంబం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), కోడింగ్ తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల పనితీరును, వాటి ఉపయోగాలను చక్కగా వివరించడంతో ముఖ్య అతిథి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఎడ్యుఫెయిర్‌లో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషా విభాగాలు సంయుక్తంగా ప్రదర్శించిన 'మన సంప్రదాయంలోనే సైన్స్ ఉంది -- దానిలో దాగిన విజ్ఞానాన్ని గుర్తిద్దాం' అనే ప్రత్యేక ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మన పూర్వీకుల ఆచారాలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాల్లో దాగి ఉన్న శాస్త్రీయ రహస్యాలను విద్యార్థులు వివరించిన తీరు అతిథులను ఎంతగానో మంత్రముగ్ధులను

చేసింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. పిల్లల ప్రతిభను చూసి తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. పుస్తకాల్లోని విజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయిస్తూ, సంప్రదాయ విజ్ఞానానికి ఆధునిక శాస్త్రసాంకేతికతను జోడిస్తూ నిర్వహించిన ఈ 'అన్వయ' ఎడ్యుఫెయిర్ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణల పట్ల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో విజయవంతమైంది.

# కార్మిక హక్కులపై దాడులను తిప్పికొడదాం

## పోరాటాలే ఏఐటీయూసీ చరిత్రకు వారసత్వం

### ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

**కాప్రా, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్. బోస్ అన్నారు . ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా లో జెండాను ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, ఈసీఐఎల్ కంపెనీ నేత శ్రీ నారాయణ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్. బోస్ మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న కార్మికుల హక్కులు, గౌరవప్రదమైన జీవనం, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో ఆవిర్భవించిన ఏఐటీయూసీ నేడు 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోందన్నారు. ఈ సందర్భంగా దేశ కార్మికవర్గానికి ఏఐటీయూసీ విప్లవాభివందనాలు తెలియజేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులకు ముప్పుగా మారుతున్నాయని ఏఐటీయూసీ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు . సమ్మె హక్కు, సంఘటితమయ్యే హక్కు, ఉద్యోగ భద్రత, సామూహిక బేరసారాల హక్కులపై పరిమితులు విధించే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయన్నారు . ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాల విస్తరణ, శాశ్వత ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యం, కనీస వేతనాల సమస్యలు, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సామాజిక భద్రత అందకపోవడం కార్మికవర్గాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్నారు . కార్మికుల సంక్షేమం పేరుతో యాజమాన్యాలకు అనుకూలంగా విధానాలు రూపొందించకుండా, కార్మికుల హక్కులు మరియు జీవన భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తోందన్నారు.

106 ఏళ్ల పోరాట చరిత్ర కలిగిన ఏఐటీయూసీ కార్మికుల సంఘటిత శక్తితో అనేక హక్కులు, సంక్షేమ సదుపాయాల సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. నేటికీ నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని, కనీస వేతనాలను గౌరవప్రదమైన జీవనానికి సరిపడా పెంచాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతను ప్రతి కార్మికుడికి కల్పించాలని ఏఐటీయూసీ పోరాటం కొనసాగిస్తోందన్నారు . కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదికతో కలిసి దేశవ్యాప్త నిరసనలు, సమ్మెలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తూ కార్మికుల గొంతుకను ప్రభుత్వానికి వినిపిస్తోందన్నారు . ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం కేవలం వేడుక కాదని, కార్మికుల హక్కుల కోసం సాగిన చారిత్రక పోరాటాలను గుర్తుచేసుకుని, నేటి సవాళ్లను ఎదుర్కొనేందుకు కార్మికులంతా ఐక్యంగా సంఘటితం కావాల్సిన సందర్భమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎస్. శంకర్ రావు, నారా నర్సింహా, జోషి, రాఘవేంద్ర రావు, నర్సింహా రావు,, మోహన్, దయానంద్, సోమ రాజు,మురళి,నరేష్, సచిన్, ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజులే గడువు.. ఓటరు నమోదుపై వేగం పెంచండి : విప్లవ్ కుమార్

**ప్రతి పట్టభద్రుడిని నేరుగా కలిసి ఓటు నమోదు చేయించాలి**

**ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కావొద్దు.. క్షేత్రస్థాయిలో పనిచేయాలి**

**ఇన్‌చార్జులకు విప్లవ్ కుమార్, శ్రీశైల్ రెడ్డి దిశానిర్దేశం**

తాండూరు అక్టోబర్ 31(జనంసాక్షి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతి ఇన్‌చార్జి మరింత పట్టుదలతో పనిచేయాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని నేరుగా కలిసి ఓటరుగా నమోదు చేయించాలని ఎన్నికల తాండూరు సమన్వయకర్త విప్లవ్ కుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై శనివారం తాండూరు బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల తాండూరు సమన్వయకర్త విప్లవ్ కుమార్ సమక్షంలో, తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా నియమితులైన 222 మంది ఇన్‌చార్జులతో పాటు అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య, సీనియర్ నాయకులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్లవ్ కుమార్ ప్రతి ఇన్‌చార్జిని ఓటరు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో జరుగుతున్న ఓటరు నమోదు వివరాలు, నమోదైన ఓట్ల సంఖ్య పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంగా తెలుసుకుంటున్నారని తెలిపారు. సాధారణ ఎన్నికలకు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా తేడా ఉంటుందని, ఈ ఎన్నికల నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఇప్పటికే నాయకులు, ఇన్‌చార్జులు కష్టపడుతున్నారని, మరింత పట్టుదలతో పనిచేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ప్రతి పట్టభద్రుడిని నేరుగా కలిసి ఓటరు నమోదు చేసుకున్నారా లేదా అని అడిగి తెలుసుకోవాలని, ఇంకా నమోదు చేసుకోని వారితో వెంటనే నమోదు చేయించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో పార్టీ పరంగా ఏవైనా సహాయ సహకారాలు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును బాధ్యతగా భావించి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా ఇన్‌చార్జులు కృషి చేయాలని కోరారు. ఒక్క అర్హుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని, నాయకులు తమ కుటుంబాల్లోని అర్హులైన పట్టభద్రులతో పాటు పరిచయస్తులందరికీ ఓటరు నమోదు చేయించాలని సూచించారు. గతంలో ఓటరుగా నమోదు చేసుకున్న వారు సైతం ఈసారి కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందనే విషయాన్ని ప్రతి పట్టభద్రుడికి అర్థం అయ్యేలా వివరించాలని తెలిపారు. స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందని, సమయం లేక నమోదు చేసుకోలేని వారి వద్దకే వెళ్లి తమ బృందం సహకారంతో నమోదు ప్రక్రియ పూర్తి చేయిస్తామని పట్టభద్రులకు భరోసా ఇవ్వాలని ఇన్‌చార్జులకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియకు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని శ్రీశైల్ రెడ్డి ఇంచార్జులకు దిశానిర్దేశం చేశారు.

## జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సీపీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీ

**కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా.. పెట్రోలింగ్, పాత కేసుల విచారణపై సమీక్ష**

అమీర్‌పేట్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల దర్యాప్తు పురోగతి, పెట్రోలింగ్ నిర్వహణ, పాత కేసుల విచారణ తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో పురోగతి, పోలీసుల పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ తనిఖీలో సీపీ వెంట జూబ్లీహిల్స్ డీసీపీ, ఏసీపీ వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్ ఉన్నారు.

## తాండూరులో మేధావుల సమావేశం

**ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

తాండూరు అక్టోబర్ 31(జనంసాక్షి) : తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షులు యురమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధావుల సమావేశానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మేధావుల పాత్ర కీలకమని అన్నారు. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై మేధావులు చర్చించి, ప్రజలకు సరైన దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, అభివృద్ధి అంశాలపై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. తాండూరు అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన మేధావులు, విద్యావేత్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టభద్రుల సమస్యలపై పోరాటానికి సిద్ధం

**ఎమ్మెల్సీగా పోటీ చేయాలంటూ దుండ్ర కుమారస్వామికి యువత, నిరుద్యోగుల డిమాండ్**

**2,500 మంది పట్టభద్రులతో ఆత్మీయ ముఖాముఖి • ఉద్యోగ, ఉపాధి సమస్యలపై విస్తృత చర్చ**

హైదరాబాద్ (జనంసాక్షి) : రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన సుమారు 2,500 మంది పట్టభద్రులు, నిరుద్యోగ యువతతో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ రిజిస్ట్రేషన్, జాబ్ మేళా కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సామాజికవేత్త దుండ్ర కుమారస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగ నియామకాల్లో జాప్యం, అర్హతలకు తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం, ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కొరత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. తల్లిదండ్రులు అప్పులు చేసి ఉన్నత విద్య చదివిస్తున్నప్పటికీ యువతకు తగిన ఉద్యోగాలు లభించకపోవడం ఆందోళనకరమని పలువురు అభిప్రాయపడ్డారు. కంపెనీల భాగస్వామ్యంతో నిర్వహించే జాబ్ మేళా ద్వారా అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు ఇచ్చే ఉద్యోగ, ఉపాధి హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో ఫలితాలు చూపాలని యువత డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పట్టభద్రులు, నిరుద్యోగ యువత దుండ్ర కుమారస్వామి రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా తమ సమస్యలను శాసనమండలిలో వినిపించాలని కోరుతూ, రాబోయే రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ రాజకీయాలకు అతీతంగా పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. యువత డిమాండ్‌పై సానుకూలంగా స్పందించిన కుమారస్వామి, ప్రజా సమస్యలకు శాసనమండలిలో గొంతుకగా నిలవాల్సిన అవసరం ఏర్పడితే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తానని తెలిపారు. గత 13 ఏళ్లుగా సామాజిక న్యాయం, బీసీల హక్కులు, విద్య, ఉపాధి, నిరుద్యోగ యువత సమస్యలపై కొనసాగిస్తున్న పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తానని స్పష్టం చేశారు. యువత నుంచి వచ్చిన ఈ రాజకీయ ప్రాతినిధ్య డిమాండ్, కుమారస్వామి సానుకూల స్పందనతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# జ్ఞానేష్ కుమార్ గద్దె దిగాలి

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): సీఈసీ జ్ఞానేష్ కుమార్ గద్దె దిగాల్సిందేనని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ అన్నారు. శనివారం సర్ ప్రక్రియను నిలిపివేయాలని షాద్ నగర్ నియోజకవర్గం కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ...140 కోట్ల జనాభాలో 13 కోట్ల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సర్ ప్రక్రియను రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, శ్రీహరి, రాజేష్, రాకేష్, రాఘవేందర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

బొంరాస్‌పేట, అక్టోబర్ 31 (జనంసాక్షి) : దుద్యాల మండలం చిల్ముల్‌మైలారం గ్రామ శివారులో వెలసిన మామిడికుంట ఆంజనేయ స్వామి సన్నిధిలో గత 40 వారాలుగా భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతుంది. శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హన్మయ్య,రామచంద్రయ్య,ఫకీరప్ప, శ్యామ్,చందర్,సతీష్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

**నవంబర్ 7,8,9న మూడు రోజులపాటు రైతు మేళ..**

**హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి**

బొంరాస్ పేట, అక్టోబర్ 31 (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు మేళ కార్యక్రమం నవంబర్ 7,8,9 న మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి రైతు మేళా నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మేళా ప్రాంగణంలో కంట్రోల్ రూమ్, వివిఐపి గ్యాలరీ, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఆర్డీవో అనిత, జిల్లా వ్యవసాయ అధికారి కవిత, డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం, తహసిల్దార్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ రిపోర్టర్ జగన్ మృతి అత్యంత బాధాకరం

**టియూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) మంచాల మండల రిపోర్టర్ జగన్ అకాల మరణం అత్యంత బాధాకరమైన విషయమని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జగన్ మృతి చెందిన విషయం తెలుసుకొని శనివారం జగన్ స్వగ్రామమైన నోముల గ్రామంలో మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం జగన్ కుటుంబ సభ్యులకు యూనియన్ నుండి 20 వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో జగన్ కుటుంబానికి యూనియన్ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. నివాళ్లర్పించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు మొకిల్ల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు జెనిగే పాండు, జిల్లా నాయకులు శశిపాల్, వెంకటస్వామి, ఇబ్రహీంపట్నం అధ్యక్షులు శ్రీనివాస్, మంచాల అధ్యక్షులు కోటప్ప, ప్రధాన కార్యదర్శి సదానంద్, సీనియర్ రిపోర్టర్లు శాస్త్రి, దశరథ, శ్రీనివాస్, మధు, మహేష్, మల్లేష్, యాదగిరి,పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

# జర్నలిస్టు జగన్ గుండెపోటుతో మృతి

- పల్నాటి జగన్ మృతి పట్ల పలువురి సంతాపం
- పాడె మోసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- కన్నీళ్ల పర్యంతమైన తోటి జర్నలిస్టులు
- తరలి వచ్చిన జర్నలిస్టులు

రంగారెడ్డి, అక్టోబర్ 31 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా మంచాల మండల నవతెలంగాణ దినపత్రిక రిపోర్టర్, ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన పల్నాటి జగన్ (51) శుక్రవారం రాత్రి గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఆయన మృతితో మంచాల మండలంలోనూ, తోటి జర్నలిస్టు లోకంలో తీవ్ర విషాదం అలుముకుంది. పలు పార్టీల నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి సామెల్ తో కలిసి పాడె మోశారు. నవతెలంగాణ సిజిఎల్ ప్రభాకర్ సిబ్బందితో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు.

**ఉద్యమ ప్రస్థానం - ప్రజా సేవ..**

పల్నాటి జగన్ తన విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐ ఉద్యమం ద్వారా తొలి అడుగులు వేశారు. ఆ తర్వాత రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సేవలు అందించారు. ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా సాగిన ఆయన ప్రస్థానం, ఉద్యమ అవసరాల రీత్యా సీపీఐ(ఎం) కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మంచాల మండల కమిటీ సభ్యునిగా 2015 నుండి కొనసాగుతున్నాడు. జనం గొంతును మరింత గట్టిగా వినిపించేందుకు 2017 నుండి నవతెలంగాణ మంచాల రిపోర్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిజెఎఫ్) ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు చేపడుతున్నారు. స్థానిక పరిపాలనలోనూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న జగన్, సీపీఐ(ఎం) తరపున నోముల గ్రామ పంచాయతీ వార్డు సభ్యునిగా విజయం సాధించి ప్రజాసేవ చేశారు. అనంతరం లింగంపల్లి సీపీఐఎం ఎంపీటీసీ అభ్యర్థిగా 2019 ఎన్నికల్లో పోటీ చేసి అత్యల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇటు ప్రజాతంత్ర ఉద్యమాల్లో, అటు ప్రజా పోరాటాల్లో నిరంతరం ముందుంటూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

**తీవ్ర శోకసంద్రంలో కుటుంబం..**

గత కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయనకు ఇప్పటికే రెండు స్టెంట్లు వేశారు. కాగా శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో తీవ్రమైన గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు తక్షణమే ఆయనను ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. అమరుడైన జగన్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు హేమచంద్ర ఇంటర్మీడియట్ చదువుతుండగా, చిన్న కుమారుడు రాఘవ 8వ తరగతి అభ్యసిస్తున్నాడు.

**సంతాపాల వెల్లువ..**

పల్నాటి జగన్ మరణ వార్త తెలిసిన వెంటనే తోటి జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం కాంగ్రెస్ టిడిపి టిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు జర్నలిస్టు సంఘాలను నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, శోకసంద్రంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. జగన్ మృతి ప్రజా ఉద్యమాలకు, జర్నలిజ రంగానికి తీరని లోటని నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామని తెలిపారు.

# రక్తదానం గొప్పది

**యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలి**

**ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణరెడ్డి**

మహేశ్వరం, అక్టోబర్ 31 (జనంసాక్షి) : అన్ని దానాల కంటే రక్తదానం చాలా గొప్పదని ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండల కేంద్రంలోని సుమంగళి కన్వెన్షన్ హాల్లో రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ...పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కందుకూరు,మహేశ్వరం పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.యువత సేవా కార్యక్రమాలల్లో ముందుండాలన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సేవ కార్యక్రమాలను చేయాలన్నారు.2000 మంది రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు.680 యూనిట్ల రక్తాన్ని విజయవంతంగా సేకరించారన్నారు.రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రశంస పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ జానకి రెడ్డి, సిఐలు రాఘవేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు,ఎస్ఐలు మారయ్య,ప్రసాద్, ధనుంజయ్, పలు గ్రామాల సర్పంచులు, ఉద్యోగస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బంట్వారం మండల ముదిరాజ్ కమిటీ ఎన్నిక

**మండల అధ్యక్షుడిగా సుబ్బినేటి మోహన్ కుమార్ ఎన్నిక**

బంట్వారం అక్టోబర్ 31 జనంసాక్షి : బంట్వారం మండల ముదిరాజ్ కమిటీని జిల్లా అధ్యక్షుడు శ్రీని వాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. మండల అధ్యక్షుడిగా సుబ్బినేటి మోహన్ కుమార్, ఉపాధ్యక్షు డిగా చింతకింది అశోక్, ప్రధాన కార్యదర్శి గా జన్మల రాములు, కోశాధికారిగా ఎను గొండ అశోక్, బక్రత్ పల్లి నరసింహులు, కార్యదర్శిగా పూలపల్లి రాజును ఎన్నుకు న్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ముదిరాజ్ సంఘం అభివృద్ధికి, సంఘం ఐక్యతకు కృషి చేయాలని నాయకులు సూచించారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ, ముదిరాజ్ల సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, మాకు ఈ బాధ్యత అప్పగించినందుకు పేరుపేరునా అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, మండల నాయకులు శాకం నరసిం హులు, శ్రీశైలం, మొగులయ్య, మల్లేశం తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో గల్లీకో బెల్టు షాపు.. ఏరులై పారుతున్న మద్యం

కొందరు వ్యక్తులు యథేచ్ఛగా మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, వీరిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం దొరుకుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు, సమయపాలనకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నా తనిఖీలు మాత్రం కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వహణపై అధికారులకు సమాచారం లేదా.?తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.?అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారుల అండదండలతోనే ఈ అక్రమ వ్యాపారం సాగుతోందన్న ఆరోపణలు కూడా వినిపిస్సున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**- మద్యం మత్తులో ఆగమవుతున్న పేద కుటుంబాలు.**

రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాల్లో మద్యం మహమ్మారి చిచ్చుపెడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన కూలీ డబ్బుల్లో అధిక భాగం మద్యానికే ఖర్చు చేస్తుండటంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని చెబుతున్నారు. మద్యం మత్తులో కుటుంబ కలహాలు,ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని, యువత కూడా మద్యానికి బానిసలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండటం సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొంటున్నారు.

**- ఎక్సైజ్ శాఖ నిద్ర వీడేదెప్పుడు.?**

బెల్టు షాపుల నియంత్రణ కోసం ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాల వారీగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా మద్యం నిల్వలు ఉంచి విక్రయిస్తున్న వారిని గుర్తించి ఆకస్మిక దాడులు నిర్వహించాలని కోరుతున్నారు.అక్రమ మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం,ముడుపుల ఆరోపణలపై కూడా ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో మద్యం విక్రయాలు కొనసాగుతుంటే వాటిని అరికట్టాల్సిన బాధ్యత ఎవరిది.? ప్రజల కుటుంబాలు మద్యం మత్తులో కుదేలవుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు.? ధారూర్ మండలంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ ఎప్పుడు కొరడా ఝుళిపిస్తుంది.? అన్న ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

**బెల్ట్ షాపులు లేని గ్రామంగా అంపల్లి.**

**- సర్పంచ్ అనంతయ్య.**

ధారూర్ మండలంలోని అంపల్లి గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రించి ప్రశాంత వాతావరణానికి నాంది పలికామని గ్రామ సర్పంచ్ అనంతయ్య తెలిపారు. బెల్ట్ షాపుల కారణంగా పేద కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, యువత మద్యానికి బానిసయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును కాపాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని కోరారు.

**యువత మద్యానికి దూరంగా ఉండాలి.**

**సర్పంచ్ బాలు నాయక్.**

యువత మద్యానికి దూరంగా ఉంటూ విద్య, ఉపాధి,అభివృద్ధిపై దృష్టి సారించాలని పులిచింత మడుగు తండా సర్పంచ్ బాలు నాయక్ సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మద్యం అలవాటు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలను కూడా ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.గ్రామాల్లో బెల్ట్ షాపుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, యువత చైతన్యంతో ముందుకొచ్చి మద్యరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు గోవర్ధన్ మాట్లాడుతూ అప్పులు చేసి, వడ్డీలకు డబ్బులు తెచ్చి పంటలు సాగు చేశామని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. బోరు మోటార్ల ద్వారా నీరు పారించుకునే ప్రయత్నం చేసినా విద్యుత్ కోతల కారణంగా మోటార్లు కాలిపోయి మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు అందించి అండగా నిలిచిందని రైతులు గుర్తుచేశారు.

అనంతరం యాచారం మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాగ్‌బుక్‌ను పరిశీలించి విద్యుత్ కోతల సమయాలు, వ్యవధిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో రైతులు నష్టపోతున్నా స్థానిక ఎమ్మెల్యే కనీసం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించడంతోపాటు నిరంతర విద్యుత్, సాగునీరు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తు వెంకట రమణారెడ్డి, యాచారం మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బాషా, నాయకులు రాజేందర్‌రెడ్డి, కారింగ్ యాదయ్య, దేరంగుల శంకర్, కాజ మహమ్మద్, గోవర్ధన్‌రెడ్డి, జెనిగే శ్రీశైలం, బొల్లంపల్లి వెంకటేష్, హబీబుద్దీన్, శమీమ్, జుట్టు శ్రీశైలం, కల్లూరి శివ, కాసాని రవి, జగదీశ్ నాయక్, మక్కపల్లి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో నాభిశిల బొడ్రాయి ప్రథమ

**వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**హయత్‌నగర్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** హయత్‌నగర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ నాభిశిల బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మధుయాష్కి గౌడ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, బొడ్రాయి గ్రామ ప్రజల ఐక్యతకు, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు గ్రామీణ సంప్రదాయాలను కాపాడటంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం గ్రామ ప్రజలకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, హయత్‌నగర్ గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సర్వతోముఖాభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీ ముస్సిని స్వరూపకు ఘన నివాళులు

**తలకొండపల్లి అక్టోబర్ 31(జనంసాక్షి):**తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామంలో గత సంవత్సర క్రితం మాజీ ఎంపీటీసీ ముస్సిని స్వరూప పరమపదించారు. వారి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తలకొండపల్లి మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్ హాజరై,స్వరూప చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గుజ్జరి రాఘవేందర్ మాట్లాడుతూ..ఎంపీటీసీ సభ్యురాలుగా స్వరూప గ్రామ అభివృద్ధికి,ప్రజా సేవకు చేసిన కృషిని కొనియాడారు.ఆమె సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని,ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం గ్రామస్తులు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కుమ్మరి శంకర్,మాజీ ఎంపీటీసీ రవి,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# మియాపూర్ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలి

- **సుప్రీంకోర్టు తీర్పుపై వామపక్షాల హర్షం**
- **550 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె వేయాలి**
- **రెవెన్యూ, హైడ్రా అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి**
- **నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని డిమాండ్**

శేరిలింగంపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి): మియాపూర్ భూముల వివాదంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును వామపక్ష పార్టీలు స్వాగతించాయి. మియాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న 550 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించిన నేపథ్యంలో అధికారులు వెంటనే స్వాధీనం చేసుకొని పరిరక్షించాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వేర్వేరు సందర్భాల్లో ఆయా పార్టీల నాయకులు మియాపూర్ భూములను పరిశీలించి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, శేరిలింగంపల్లి నాయకులు చల్లా శోభన్, కొంగరి కృష్ణ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించారు. సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ కూడా తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు, భూకబ్జాదారుల ప్రలోభాలకు తలొగ్గకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వులను కఠినంగా అమలు చేయాలని కోరారు.

శేరిలింగంపల్లి పరిధిలో గతంలోనూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన భూములు చేజారిపోయాయని వామపక్ష నాయకులు ఆరోపించారు. మియాపూర్ భూముల విషయంలోనూ గతంలోనే అధికారులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ప్రభుత్వ భూముల పరిరక్షణ సాధ్యమయ్యేదని పేర్కొన్నారు. ప్రస్తుతం మిగిలి ఉన్న ప్రభుత్వ భూములకు వెంటనే హద్దులు నిర్ణయించి పటిష్టమైన కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, హైడ్రా అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఒక్క గజం భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మియాపూర్‌తోపాటు శేరిలింగంపల్లి పరిధిలోని ఇతర ప్రభుత్వ భూములపైనా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గురుకుల్ ట్రస్ట్ భూములు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు చేస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని సూచించారు. భూముల ఆక్రమణలతో చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులకు నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్న నిరుపేదలను గుర్తించి, అర్హులైన వారికి పట్టాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డాక్టర్ కె. నారాయణ కోరారు. భూముల పరిరక్షణతోపాటు పేదల నివాస సమస్యను కూడా మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని అన్నారు.

నారాయణ వెంట సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, టి. రామకృష్ణ, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కె. చందు యాదవ్, దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

**రూ.52,240 నగదు, పేకముక్కలు స్వాధీనం**

మర్పల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి): మర్పల్లి మండల కేంద్రంలోని అబ్దుల్ రెహ్మాన్ వెంచర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఏడుగురు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.52,240 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలో పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాల కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. కాగా, అబ్దుల్ రెహ్మాన్ వెంచర్ పరిసరాల్లో పేకాట, బహిరంగంగా మద్యం సేవించడం వంటి ఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

# గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం

**అమీర్‌పేట / సికింద్రాబాద్, అక్టోబర్ 31 (జనం సాక్షి):** గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియలో ఎన్నికల కమిషన్ తగిన స్థాయిలో చర్యలు చేపట్టడం లేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట, మోండా, పద్మారావు నగర్ డివిజన్లలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హులైన గ్రాడ్యుయేట్లు దానిని వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. నమోదు ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ తగిన సిబ్బందిని నియమించడం లేదని ఆరోపించారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు సేకరించిన దరఖాస్తులను అధికారులకు అందజేసినప్పటికీ స్వీకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా తిరిగి నమోదు చేసుకోవాల్సి రావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్లు ఉన్నప్పటికీ నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదన్నారు. బన్సీలాల్‌పేట డివిజన్‌లోని గాంధీనగర్ కమిటీ హాల్‌లో గ్రాడ్యుయేట్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మరికొందరికి నమోదు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుర్మ హేమలత, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మోండా డివిజన్ బండిమెట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
పద్మారావునగర్ డివిజన్ భోలక్‌పూర్‌లోని పాటిదాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని తలసాని ప్రారంభించారు. కాలనీలు, బస్తీల్లోని అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, వెంకటేషన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ - కళాశాలకు 40 పుస్తకాల విరాళం

**హయత్‌నగర్, అక్టోబర్ 31 (జనంసాక్షి) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పదవీ విరమణ పొందిన రీడర్ డా. బి. సత్యనారాయణ రెడ్డి విద్యార్థులకు లైఫ్ సైన్సెస్‌లో డిగ్రీ అనంతరం ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో అవకాశాలు, వివిధ కెరీర్ మార్గాలు, లక్ష్య సాధనకు అవసరమైన నైపుణ్యాల గురించి వివరించి, విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు మాట్లాడుతూ, తాను రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎస్‌సి. చదువుతున్న సమయంలో డా. బి. సత్యనారాయణ రెడ్డి తనకు గురువుగా ఉండి, పీజీ ప్రవేశ పరీక్షకు అవసరమైన బోటనీ సబ్జెక్టును బోధించారని గుర్తుచేసుకున్నారు. తన గురువును కళాశాలకు ఆహ్వానించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.
అనంతరం విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధి, పఠనాసక్తిని పెంపొందించాలనే సదుద్దేశంతో డా. బి. సత్యనారాయణ రెడ్డి కళాశాల గ్రంథాలయానికి, వృక్షశాస్త్ర విభాగానికి కలిపి 40 పుస్తకాలను విరాళంగా అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఆయన అందించిన ఈ పుస్తకాలు ఎంతో దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. ఆర్. యాదగిరి, కళాశాల గ్రంథపాలకులు, అధ్యాపకులు డా. సత్యనారాయణ రెడ్డి చేసిన సేవను అభినందిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, లైఫ్ సైన్సెస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- **తలకొండపల్లిలో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి,సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు**

**తలకొండపల్లి అక్టోబర్ 31 (జనంసాక్షి):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు ఆవాంచ నరసింహారెడ్డి కొనియాడారు.మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు,దేశ మాజీ ప్రధాని,భారతరత్న ఇందిరా గాంధీ 40,వ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో చెల్లాచెదురుగా ఉన్న 562 సంస్థానాలను ఏకం చేసి నేటి అఖండ భారతాన్ని నిర్మించిన ఘనత సర్దార్ పటేల్ కే దక్కుతుందని కొనియాడారు. దేశంలోని సామాన్య రైతుల కోసం,దేశ ఐక్యత కోసం ఆయన చేసిన కృషి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీయీకరణ,హరిత విప్లవం, ద్వారా దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా చేసిన ఘనత ఇందిరాగాంధీదే అన్నారు.పేదల సంక్షేమం కోసం 20 సూత్రాల పథకం,దేశ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ధీరవనిత ఇందిరమ్మ అని గుర్తు చేశారు.వారి ఆశయాలను కొనసాగించడమే మనం వారికి ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగాన్ని,దేశ ఐక్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని,కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆ దిశగానే పనిచేస్తుందని తెలిపారు.వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామగ్రామాన వారి సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రేణు రెడ్డి,ఇంద్రకంటి రాఘవేందర్ గౌడ్,అజీజ్,మీసేవ మల్లేష్, నర్సింహులు, గణేష్, సభావట్ రాజేందర్, శివకుమార్, లక్ష్మయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# మోకిల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ యోగేష్ గౌతమ్

**శంకర్ పల్లి, అక్టోబర్ 31(జనం సాక్షి) :** మోకిలా పోలీస్ స్టేషన్‌ను చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, (ఐపీఎస్) శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, రిజిస్టర్లు, కేసుల ఫైళ్లను పరిశీలించారు.పోలీస్ అధికారులతో మాట్లాడి విధుల నిర్వహణ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవా లని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణకు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మోకిల ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ రెడ్డి,ఎస్.ఐ లు లక్ష్మణ్,సురేష్,పద్మ మరియు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఓటు బచావో - దేశ్‌కు బచావో" కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ JAC నాయకుల ఢిల్లీ పయనం

**30 మందికి పైగా నాయకులు, కార్యకర్తలతో దేశ రాజధానికి ప్రయాణం**

**కూకట్పల్లి, అక్టోబర్ 31(జనంసాక్షి):** ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "ఓటు బచావో - దేశ్‌కు బచావో" కార్యక్రమంలో పాల్గొనేందుకు కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 30 మందికి పైగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఓటు హక్కు పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా చాటి చెప్పనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం కూకట్పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు–కార్యకర్తల మధ్య ఐక్యతను పెంపొందించడం, భవిష్యత్ కార్యాచరణ పై సమిష్టిగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కూకట్పల్లి కాంగ్రెస్ జేఏసీ ఆధ్వర్యంలో నాయకుల సమిష్టి ఢిల్లీ పయనం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన**

# మహానేతలను స్మరించుకున్న మధుయాష్కి గౌడ్

- **గాంధీభవన్‌లో ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు**

**హయత్ నగర్, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహానేతలను స్మరించుకోవాల్సిన రోజు అక్టోబర్ 31 అని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి దేశ నిర్మాణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతకు పటిష్టమైన పునాదులు వేశారని, ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. దేశ నిర్మాణంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్ర కూడా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారని, బ్యాంకుల జాతీయీకరణ ద్వారా సామాన్యులకు ఆర్థిక అవకాశాలు విస్తరించారని తెలిపారు. హరిత విప్లవానికి ప్రోత్సాహం అందించి వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన నాయకురాలిగా ఇందిరాగాంధీ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.
తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తోందని మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం, ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం తమ జీవితాలను ధారపోసిన మహనీయుల చరిత్రను, వారు చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే మహానేతలను స్మరించుకునే విషయంలో కూడా బీజేపీ రాజకీయాలు చేస్తోందని మధుయాష్కి గౌడ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.